# లాటరీ టికెట్

శర్మ సిహెచ్.




వామనమూర్తి ఓ గవర్నమెంటు ఆఫీసులో క్యాషియర్. ఆఫీసులోని స్టాఫంతా ప్రతినెలా జీతం అతని చేతులమీదుగానే తీసుకోవాలి. ఫస్టు తారీఖు వస్తుందంటే చాలు, ఆఫీసులో అందరూ వామనమూర్తి గురించే మాట్లాడుకుంటారు.

ఎందుకంటే, వామనమూర్తి ఓ ప్రత్యేక తరహా వ్యక్తి. ఆఫీసులో ఎవరితోను కలవడు. మాట్లాడడు. స్టాఫ్ చేసుకునే పార్టీలలో పాలు పంచుకోడు. ఏనాడూ తాను మిగతావారికి పార్టీ ఇచ్చిన పాపానపోలేదు. అయితే, వామనమూర్తిలో ఒక దుర్గుణం వుంది. ఏమిటంటే— ప్రతినెలా స్టాఫ్‌కు ఇచ్చే జీతాలలోని చిల్లర పైసలను ఇవ్వడం ఎగ్గొడతాడు. ఈ పద్ధతి స్టాఫ్‌కు నచ్చేదికాదు. అయినా, 'ఏదో పిల్లలుగలవాడులే, చిల్లర ఇమ్మని అడిగితే బాగుండదు' అని కొందరు సర్దుకుపోతే, అదేంకాదు, వామనమూర్తి మహాపిసినారి, ఏనాడు మనకు కనీసం టీ అయినా త్రాగించలేదు. ఈ చిల్లర డబ్బులన్నీ దాచుకుని మేడ కడతాడుకాబోలు అని కొందరు వ్యాఖ్యానించేవారు. ఈ వ్యాఖ్యలన్నీ విన్నాకూడా, విననట్టు వుండి తన పనేదో తను చూసుకుపోయేవాడు వామనమూర్తి.

కాలగమనంలో రోజులు దొర్లిపోతున్నాయి. ఒకరోజు హఠాత్తుగా వామనమూర్తిలో ఎవరూ ఊహించనటువంటి మార్పు వచ్చింది. ఆరోజు ఆఫీసుకు రాగానే వామనమూర్తి మిగతా స్టాఫ్‌ను అర్జెంటుగా సమావేశపరచి, "డియర్ ఫ్రెండ్స్! ఈ రోజు రాత్రికి మీ అందరికీ కాంధారీ హోటల్‌లో డిన్నర్ ఏర్పాటుచేశా. మీరందరు తప్పకుండా రావాలి. వివరాలు తర్వాత చెబుతాను" అని నాలుగుముక్కలు చెప్పి వెళ్ళిపోయాడు.

ఈ విషయం విన్న స్టాఫంతా సందిగ్ధంలో పడిపోయారు.

"ఇది కలా? నిజమా?" అని క్లర్కు రాధాకృష్ణ ఆశ్చర్యాన్ని వ్యక్తంచేశాడు.

"నా పదేళ్ళ సర్వీసులో వామనమూర్తి పార్టీ ఇవ్వడం ఇదే మొదటిసారి" అన్నాడు స్టెనోగ్రాఫర్ సారథి.

"ఇది 1985కే గుడ్‌జోక్" అని మల్లిక్ జోక్ పేల్చాడు.

"అసలు ఇంతకీ పార్టీ ఎందుకిస్తున్నట్టో"అని క్వశ్చన్‌మార్కు ముఖంపెట్టాడు హరి.

"ఏదయితేనేం ప్రస్తుతం మనకుకావలసింది పార్టీ. అందులోను కాంధారీలో డిన్నర్ ఇస్తానన్నాడు. వెళ్ళకపోతే బాగుండదు" అని ఉత్సాహంగా చెప్పాడు శ్రీనివాసులు. అందరూ ఏకగ్రీవంగా శ్రీనివాసులు నిర్ణయాన్నిఆమోదించి, పార్టీకి వెళ్ళడానికి నిశ్చయించుకున్నారు.

రాత్రి 7 గంటలు అవుతుండగాఒక్కొక్కరే కాంధారీ హోటల్‌కి రాసాగారు. నిజంగానే వామనమూర్తి డిన్నర్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ కన్పించాడు. అందరూ అతన్ని అభినందించి, ఇంతకీ పార్టీకి కారణం ఏమిటి? అని అడిగారు.

ఇక తప్పదన్నట్టు అసలు విషయం బయటపెట్టాడు వామనమూర్తి.

"నేను ఇంతకాలం మీరనుకున్నట్టుగా మీ జీతాలలోని చిల్లరడబ్బులను మిగుల్చుకుని మేడ కట్టలేదుకదా! కనీసం ఒక్క పైసాకూడా నా స్వప్రయోజనానికి ఖర్చుపెట్టుకోలేదు. ప్రతినెలా మిగిల్చిన చిల్లర డబ్బులతో నెలనెలా మీ పేర అన్ని రాష్ట్రాల లాటరీ టిక్కెట్లు కొంటూ వచ్చాను. ఇన్నేళ్ళుగా మీ అందరిచేతా మాటలు పడుతూ కొంటున్నానేగాని, ఫలితం మాత్రం లేకపోయేది. అయినా, నా పట్టుదల వీడ లేదు. ఇన్నాళ్టికి నా కోరిక ఫలించి, మీ అదృష్టం బాగుండి నేను కొన్న టిక్కెట్టుకు లక్ష రూపాయల బహుమతి వచ్చింది. నిన్ననే డబ్బుకూడా చేతికి వచ్చింది. అందుకే ఈ పార్టీ. ఈ డబ్బుతో మీ కోసం ఒక సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తా. ఇది మీ భవిష్యత్తుకు బాగా ఉపయోగపడుతుంది"అని ఓ చిన్నసైజ ఉపన్యాసమిచ్చేశాడు వామనమూర్తి.

ఇదంతా విన్న స్టాఫంతా కాసేపు ఆశ్చర్యంలో మునిగిపోయి, ఇన్నాళ్ళు తాము తప్పుగా అర్థం చేసుకున్నందుకు తమను క్షమించమని వామనమూర్తిని కోరారు. ఆనందోత్సాహాల మధ్య అందరూ డిన్నర్ ముగించారు.

*